క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 18, బెండ 55, పచ్చి మిర్చి 40, కాకర 38, బీర 45, క్యాబేజి 10, ఫ్రెంచిబీన్స్ 50, క్యారెట్ 15, దొండ 35–40, చిక్కుడు 35, గోకర 45, బీట్ రూట్ 15, క్యాప్సికం 47, ఆలు 18, దోస 35, సొర 15, పొట్ల 15, ఉల్లి 14, చామగడ్డ 65 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన న్యూ ఇందిరానగర్ కాలనీ సభ్యులు

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ న్యూ ఇందిరా నగర్ కాలనీ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికై న నరేష్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వారు శాలువాతో ఘనంగా సత్కరించారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమకు సహకరించాలని నూతన కమిటి సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. బీఆర్‌ఎస్ డివిజన్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ఉపాధ్యక్షుడు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి నరసింహ, కార్యదర్శులు వెంకటస్వామి, కృష్ణ, ట్రెజరర్ ఐలయ్య, కాలనీ నేతలు వెంకటేష్‌రాజు, శ్రీనివాస్, శివ, రమేష్, రాజేందర్, రవికుమార్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈశ్వరమ్మ యాదవ్

వనస్థలిపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వనస్థలిపురం జనప్రియ హోమ్స్ కాలనీలో శ్రీ వైష్ణవి జనప్రియ మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ కమిటీ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్లోబల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీపీ,షుగర్ కార్డియాక్, పిడియాట్రీషియన్, గైనిక్, దంత సమస్యలపై పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. మహిళా మండలి అధ్యక్షురాలు పి.జ్యోతిసాయి, ఉపాధ్యక్షులు కె.రమ, పి.రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి డి.పద్మావతి, సంయుక్త కార్యదర్శి ఎం.మమత, కోశాధికారిలు కె.భాగ్యలక్ష్మి, వి.శశికళ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


ప్రాజెక్టును పరిశీలిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ తదితరులు

నాగోలు: విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లోని ప్రతిభకు మరింత పదును పెట్టొచ్చని వికారాబాద్ జిల్లా మెజిస్ట్రేట్ తరిగొప్పుల మహేందర్ అన్నారు. నాగోలు డివిజన్ జైపురి కాలనీలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో విజన్–2023 విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా జడ్జి మహేందర్ మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో అన్ని రకాల పరిజ్ఞానాన్ని పెంపొందించాలని సూచించారు. కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ మాట్లాడుతూ... 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా రాయాలని సూచించారు. తెలంగాణ మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజినీదేవి, మేడ్చల్ టీఆర్‌ఎస్‌ఎంఎ అధ్యక్షుడు శ్రీరామేశ్వర్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ రాంరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, మమత, ఇంచార్జి పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రామంతాపూర్: రోజు కూలి చేసుకుంటూ జీవనం సాగించే పాశం శివకుమార్ ఇటీవల మృతిచెందాడు. దీంతో రామంతాపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘం నేతలు మృతుడి భార్య శ్రీవాణికి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు చిటికల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పాయసం గోపాల్, తిరుపతి, బాలస్వామి, గంగాధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆహ్లాదం @ అంజిరెడ్డి కాలనీ

పచ్చదనంతో నేత్రపర్వంగా కాలనీ వీధులు

ఆహ్లాదాన్ని పంచుతున్న పార్కులు

విశాలంగా ప్రధాన, అంతర్గత రహదారులు

చల్లని గాలులు.. పక్షుల కిలకిలారావాలతో పచ్చందాల నడుమ అంజిరెడ్డి కాలనీ ఆహ్లాదాన్ని పంచుతోంది. పరిశుభ్రంగా కనిపించే విశాలమైన తారు, సీసీ రోడ్లు, రహదారుల పక్కన ఎత్తైన బహుళ అంతస్తుల భవనాలు, కాలనీకి కూతవేటు దూరంలో ఆధ్యాత్మికత నిలయమైన కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయం, అందంగా తీర్చిదిద్దిన పార్కులతో ఆ కాలనీ ఎంతో ముచ్చటగొలుపుతుందనడం అతిశయోక్తికాదు.


పరిశుభ్ర రహదారుల పక్కన ఎత్తైన పచ్చటి చెట్లు



చంపాపేట: చంపాపేట డివిజన్‌లోని అంజిరెడ్డికాలనీ 1996లో 8 ఎకరాల 4 కుంటల విస్తీర్ణంలో ఆవిర్భవించింది. రెండు పార్కు స్థలాలతో 86 ప్లాట్లతో హుడా లేఅవుట్‌తో ఏర్పడింది. మొదట్లో పదుల సంఖ్యలో మాత్రమే స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని సమస్యల నడుమ జీవనం కొనసాగిస్తుండేవారు. 2000లో కాలనీ సంక్షేమ సంఘం ఏర్పడిన అనంతరం కాలనీ అన్ని విధాలా అభివృద్ధి బాట పట్టింది.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

పెరుగుతున్న కాలనీ జనాభా అవసరాలకు అనుగుణంగా 15 నుంచి 20 సంవత్సరాల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాలనీ అంతర్గత రహదారిని నలభై అడుగుల నుంచి 60 అడుగుల విశాలంగా ఏర్పాటు చేశారు. భూగర్భ డ్రైనేజీ, వరద నీటి కోసం ఓపెన్ నాలాలు, పూర్తి స్థాయి అవుట్‌లెట్‌తో ఏర్పాటు చేయడంతో మురుగు సమస్య కానరాదు.

సమైక్యంగా.... స్వతంత్రంగా...

ప్రజలకు తగిన వసతులు కల్పించుకునేందుకు చిత్తశుద్ధితో కాలనీ నేతలు పనిచేశారు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని వేచిచూడకుండా సమష్టిగా తగిన వసతులను సమకూర్చుకోవడం ఆ కాలనీవారి ప్రత్యేకత. కాలనీలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న తాజా, మాజీ శాసనసభ్యులు, ఇతర ప్రముఖ ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి ఉన్నత అధికారులు విశ్రాంత ఉద్యోగులు దసరా, సంక్రాంతి, వినాయక చవితి, రంజాన్, బక్రీద్ వంటి పర్వదినాలను కాలనీవాసులతో కలసి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందిన పార్కుల్లో చేరి ఒకే కుటుంబంలా నిర్వహించుకుంటారు. ఇతర కాలనీవాసులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని రాజకీయాలకు అతీతంగా మోడల్ కాలనీల్లా తీర్చి దిద్దటమే ప్రధాన లక్ష్యం. వర్షా కాలంలో తరచూ ముంపుకు గరయ్యే లోతట్టు కాలనీల ముంపు సమస్య పరిష్కారానికి త్వరలో ఓవైసీ కాలనీ నుంచి మారుతీనగర్, యాదగిరినగర్, దుర్గాభానీ నగర్ కాలనీల నుంచి సరూర్‌నగర్ చెరువు వరకు వరదనీటి కాలువ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. దీంతో వరద నీటి ముంపు సమస్యకు చెక్ పడుతుంది. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేంకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తా.

– వంగా మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్

అందరి సహకారంతోనే...



కాలనీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కాలనీవాసుల సహాయ సహకారాలు పూర్తి స్థాయిలో ఉన్నాయి. త్వరలో విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్ల ఏర్పాటు, ఔషధ మొక్కల పార్కును పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. తడి, పొడి చెత్తను సేకరించేందుకు సిబ్బంది ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం. కాలనీలో వేల సంఖ్యలో పావురాలు స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవటం వల్ల పలువురు అనారోగ్యం పాలవుతున్నారు. అధికారులు స్పందించి ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– రఘుపతిరెడ్డి అంజిరెడి కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు

అభివృద్ధికి సహకరించాలి



కాలనీ చౌరస్తాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు వంటి పలు చిన్నపాటి అభివృద్ధి పనుల విషయమై ఇప్పటికే సర్కిల్ అధికారులు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో ఆ పనులు కూడా ప్రారంభం అవుతాయని ఆశిస్తున్నాం. మా కాలనీని ఇతర కాలనీలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్ది జీహెచ్‌ఎంసీ నుంచి అవార్డును కైవసం చేసుకునేందుకు కృషిచేస్తున్నాం.

– మోహన్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం


హస్తినాపురంలో సమస్యలను తెలుసుకుంటున్న జక్క యాదగిరి

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని బీఎస్పీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి జక్క యాదగిరి ఆరోపించారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని హస్తినాపురం నార్త్, ఇంద్రప్రస్థకాలనీ, పద్మావతి కాలనీలలో కాలనీవాసులతో కలిసి మార్నింగ్ వాక్ చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాలలో డ్రైనేజీ, వరదనీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. చేపలచెరువు, బైరామల్‌గూడ చెరువులు కబ్జా అయినందునే సమస్య తలెత్తిందన్నారు. కార్యక్రమంలో నేతలు ఎ.స్వామి, వై.అశోక్, కోట్ల కృష్ణ, జి.శేఖర్, డి.కొండల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

హుడాకాంప్లెక్స్: విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ ఆకాంక్షించారు. ఆదివారం సరూర్‌నగర్‌లోని శ్రీ విద్యా విహార్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనకు ఆమె సినీనటి మైథిలీరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో ఉన్న ఆలోచనలు, ప్రతిభను వెలికితీసేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కే శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ భారతి, కార్తీక్, కందికంటి పండరీనాథ్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యం నడకతో పరిపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే జైపాల్ యాదవ్


విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న డాక్టర్ బాలరాజు నాయుడు

సైదాబాద్: చక్కని ఆరోగ్యం, దీర్ఘకాల శారీరక దృఢత్వానికి క్రమం తప్పకుండా చేసే నడక ఎంతగానో తోడ్పడుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం చంపాపేట ప్రధాన రహదారిలోని ఓనస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఒబెసిటీపై అవగాహన కల్పించేందుకు 5కే రన్ నిర్వహించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌గుప్తా 5కే రన్‌ను ప్రారంభించారు. 200 మందికిపైగా రన్‌లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఓనస్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ బాలరాజు నాయుడు మాట్లాడుతూ... ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లు తీసుకోవడం వలన ఊబకాయంతోపాటు పలు రోగాలకు కారకం అవుతాయన్నారు. మంచి ఆహార నియమాలు పాటిస్తూ నిత్యం నడవటం, రన్నింగ్ చేయటం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ప్రస్తుత జనరేషన్‌లో 40 ఏళ్లకే మోకాళ్ల అరుగుదల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అందుకు నివారణగా నిత్యం ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా వాకింగ్ చేయాలని ఆయన సూచించారు. 5కే రన్‌లో విజేతలకు, పాల్గొన్న వారికి ఆయన జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరూప్‌స్వామి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పండగలపై ఆంక్షలు సరికాదు

మీర్‌పేట: పండుగలు, ర్యాలీలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆంక్షలు విధిస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తోందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. మీర్‌పేట కార్పొరేషన్ నందిహిల్స్‌లో అరుణాచలేశ్వర స్వామి ఆలయ 5వ వార్షికోత్సవంలో స్థానిక కార్పొరేటర్ పెండ్యాల శివపార్వతి నర్సింహ్మాతో కలిసి ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బట్టేల్ గుట్టపై కాషాయ జెండా ఎగురవేస్తామంటే కేసులు నమోదు చేయించిన ఘనత మంత్రి సబితా రెడ్డికే దక్కుతుందని, ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధీరజ్‌రెడ్డి, తిరుపతిరెడ్డిచ నర్సింహారెడ్డి, అశోక్, గోపీనాథ్, కృష్ణారెడ్డి, కేశవరెడ్డి, విక్కీ సాగర్, మల్లికార్జున్, రవి, శ్రీను, శేఖర్, మనోజ్ ఆలయ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విజయచాముండి హోమం

హస్తినాపురం: డిఫెన్స్‌కాలనీలోని శ్రీహరిహరక్షేత్ర అయ్యప్ప స్వామి ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగవరోజు ఆదివారం విజయ చాముండి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలతో పూజలు ముగిశాయి. కార్యక్రమంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, ఆలయ వ్యవస్థాపక చైర్మన్, చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ వంగా చంద్రారెడ్డి పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌నగర్‌లో 'ఆయుష్మాన్ భారత్' నమోదు

దిల్‌సుఖ్‌నగర్: ఆయుష్మాన్ భారత్‌తో ప్రధాని నరేంద్రమోడీ నిరుపేదలకు ఆరోగ్య భద్రత కల్పించారని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో ఆదివారం ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన లబ్ధిదారుల నమోదు కార్యక్రమం ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ... ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించటం అఖండ భారతవనిలో అతిపెద్ద ఆరోగ్య స్కీమ్ అన్నారు. దీని కోసం ఏటా కేంద్ర ప్రభుత్వం రూ. 8,800 కోట్లకుపైగా కేటాయిస్తుందన్నారు. ఎన్టీఆర్‌నగర్‌లో నివసించే పేదలు, మధ్య తరగతి, వేతన జీవులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ మాజీ కన్వీనర్ ధీరజ్ రెడ్డి, పిట్ట ఉపేందర్ రెడ్డి, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు ముంతా రాములు, నేతలు కొట్టం వెంకటేశ్, శ్రీనివాస్, రమేశ్ గౌడ్, సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు సిద్దూ ముదిరాజ్, మహిళామోర్చా నాయకురాళ్లు కరుణ, షకీరా బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.


నమోదులో పాల్గొన్న శ్రీరాములు యాదవ్, రాధా ధీరజ్‌రెడ్డి

అయ్యప్ప స్వామికి బంగారు కిరీటం

అలంకరించిన చాగంటి కోటేశ్వరరావు


ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

హస్తినాపురం: పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా అయ్యప్ప స్వామివారికి వజ్రవైఢూర్యాలు పొదిగిన బంగారు కిరీటాన్ని అలంకరించారు. సరస్వతి జ్ఞానపుత్ర చాగంటి కోటేశ్వరరావు కిరీటాన్ని స్వామివారి విగ్రహానికి అలంకరించారు. అనంతరం ఆదివారం రాత్రి భక్తులను ఉద్దేశించిన అనుగ్రహ భాషణం చేశారు. కోటేశ్వరరావు ప్రవచనాలు వినేందుకు వేలాదిగా భక్తులు ఎల్‌బీనగర్, కర్మన్‌ఘాట్, బైరామల్‌గూడ, హస్తినాపురం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. అయ్యప్ప ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వంగా మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ డైరక్టర్లు పాల్గొన్నారు.

మహిళా యూనివర్సిటీ వీసీకి సన్మానం

అబిడ్స్: మహిళా యూనివర్సిటీ తొలి వైస్ చన్సలర్‌గా నియమితులైన ఎం.విజ్జులతకు గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా ఆదివారం పూలబొకేను ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో తొలి మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేయడం ద్వారా మహిళా రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన

గన్‌ఫౌండ్రీ: రొమ్ము కేన్సర్‌ను తరిమి కొట్టాల్సిన అవసరం ఎంతగానో ఉందని కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి, పద్మశ్రీ డాక్టర్ పద్మనాబయ్య అన్నారు. ఆదివారం రవీంద్ర భారతిలో విశాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రొమ్ము కేన్సర్‌పై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే సరైన శస్త్ర చికిత్స చేసుకోవడానికి వీలవుతుందని తెలిపారు. మద్యపానం, దూమపానం వంటి వాటి వల్ల అనేక మంది వివిధ రకాల కేన్సర్ల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి.రఘురామ్ మాట్లాడుతూ.. రొమ్ము కేన్సర్‌పై అవగాహన లేకపోవడం వల్ల ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా లక్షకు పైగా చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ భేష్

సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు


డీసీపీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

మలక్‌పేట: మలక్‌పేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో కాచిగూడ ప్రతిమ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న ఆస్పత్రి నిర్వాహకులను అభినందించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వనపర్తి రమేష్ మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్, 2డీ ఇకో, ఈసీజీ తదితర పరీక్షలు ఉచితంగా చేశారని తెలిపారు. వైద్యులు దాదాపు 300 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, సలహాలు, సూచనలు ఇచ్చారన్నారు. సంఘ నాయకులు డీసీపీని సన్మానించారు. కార్యక్రమంలో బొశెట్టి హరినాథ్‌గుప్తా, బి.జగన్, అశోక్‌కుమార్, మంచికంటి జగన్‌గుప్త, వనపర్తి సురేష్, యెడవల్లి అశోక్, డాక్టర్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నూతన కార్యవర్గం


కార్యవర్గ సభ్యులు

నాగోలు: నాగోలు డివిజన్ శ్రీ సాయి నగర్ సౌత్ కాలనీలోని శ్రీపోచమ్మ–మైసమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్‌గా సిద్దాల ఐలయ్య కురుమ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా సిద్దాల పెద్ద వెంకటేష్, సిద్దాల అరవింద్, సిద్దాల వెంకటేష్, పడమటి దయానంద్ రెడ్డి, అంతటి నరేందర్ గౌడ్, ఇ.యాదగిరి, సి.హెచ్. మల్లారెడ్డి, చెరుకు ఉమేష్ గౌడ్, వంజరి శివకృష్ణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ... శ్రీపోచమ్మ–మైసమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కాలనీ అధ్యక్షుడు డి.మల్లేశం, సెక్రటరీ అశోక్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'బచ్‌పన్' గ్రాడ్యుయేషన్ డే

నాగోలు: విద్యార్థులకు చిన్ననాటి నుంచే అన్ని విషయాలపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ అన్నారు. కొత్తపేట, నాగోలులోని బచ్‌పన్ ఆకాడమీ హైట్స్ పబ్లిక్ స్కూల్ యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్ కొత్తపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా విద్యార్థులకు మెడల్స్‌ను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులను వినోదాలకే పరిమితం చేయకుండా విజ్ఞానాన్ని, మంచి విద్య అభ్యసించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. లైయన్స్ క్లబ్ కొత్తపేట అధ్యక్షుడు లయన్ విజయరంగా, స్కూల్ చైర్మన్ జితేంద్రదేవి తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

కాంగ్రెస్‌తోనే సర్వతోముఖాభివృద్ధి


యాత్ర కరపత్రాన్ని అందజేస్తున్న మల్‌రెడ్డి రామ్‌రెడ్డి

చంపాపేట: కేంద్రం, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపడితేనే సంక్షేమం, అభివృద్ధి పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రామ్‌రెడ్డి అన్నారు. పార్టీ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కర్మన్‌ఘాట్, క్రాంతినగర్, శుభోదయ, దుర్గానగర్ కాలనీలలో పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నారు. క్రాంతి క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో రామ్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి దేశ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతి కాంగ్రెస్‌తోనే సాధ్యం అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, రూ. 500కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులైన పేదలందరికీ రూ. 5 లక్షల విలువైన వైద్యసేవలు వంటి పలు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు పార్టీ అధిష్టానం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిందని స్పష్టం చేశారు. పార్టీ నేతలు సునీల్, మెగిలిపువ్వు నారాయణ, సారయ్య, యాదగిరి, సాయిరామ్ యాదవ్, నరేందర్‌గౌడ్, ఉమేష్‌బాబు, భార్గవ్, పరమేష్, సంతోష్, శ్రీకాంత్, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.